డిప్యూటీ సీఎంను కలిసిన టీఎన్జీవోలు

డిప్యూటీ సీఎంకు మెమెంటో అందజేస్తున్న టీఎన్జీవోలు

హనుమకొండ/సుబేదారి, జూలై 15: హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను హనుమకొండ జిల్లా టీఎన్జీవో నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి జ్ఞాపికతో సత్కరించారు. ఉద్యోగుల సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ తీసుకెళ్లారు. జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, కోశాధికారి పనికెల రాజేశ్, కత్తి రమేశ్, పృథ్వీ పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కతోపాటు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు.

బల్దియాలో బదిలీల ప్రక్రియ షురూ

వరంగల్, జూలై 15 : బల్దియా ఉద్యోగుల బదిలీల ప్రక్రియ మొదలైంది. రెండేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న వారిని బదిలీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో కసరత్తు చేస్తున్నారు. రెండేళ్ల సర్వీస్ పూర్తయిన ఉద్యోగులు ఇప్పటికే బదిలీలపై ఆప్షన్స్ ఇచ్చారు. వారికి సోమవారం మున్సిపల్ ఆర్డీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇచ్చిన ఆప్షన్ ప్రకారం బదిలీకి అంగీకారం తెలుపుతున్నట్లు సంతకాలు తీసుకున్నారు. తొలి రోజు కౌన్సెలింగ్‌కు సీనియర్ అసిస్టెంట్లు, హెల్త్‌అసిస్టెంట్లు హాజరయ్యారు. కౌన్సెలింగ్ పూర్తయిన ఉద్యోగుల జాబితాను సీడీఎంఏ కార్యాలయానికి పంపనున్నారు. నాలుగైదు రోజుల్లో 21 మంది సీనియర్ అసిస్టెంట్లు, 18 మంది హెల్త్ అసిస్టెంట్ల బదిలీ ఉత్తర్వులు వెలువడనున్నాయి. శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేనేజర్లుకు సంబంధించిన కౌన్సెలింగ్ ఈనెల 18న హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఇంజినీంగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగాలకు చెందిన అధికారులు బదిలీలకు సంబంధించిన ఆప్షన్లు ఇచ్చారు. ఈ నెలాఖరు వరకు బల్దియాలోని అన్ని విభాగాల్లో ఉద్యోగుల బదిలీలు జరుగనున్నాయి.

గంజాయి నిర్మూలనకు ఫ్లెక్సీలతో ప్రచారం

హనుమకొండ ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సుబేదారి, జూలై 15 : గంజాయి నిర్మూలన కోసం కాజీపేట ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వేముల చంద్రమోహన్ సొంత ఖర్చులతో వినూత్నంగా ప్రచార ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సోమవారం హనుమకొండలోని సుబేదారి ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్, నిట్, కాజీపేట రైల్వేస్టేషన్ వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు గంజాయి మత్తుకు బానిస కావొద్దని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కష్టపడి ఉన్నతంగా ఎదగాలని సూచించారు.

వినతి పత్రం అందజేస్తున్న ముదిరాజ్‌లు

'ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి'

హనుమకొండ, జూలై 15 : ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలని, వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ముదిరాజులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేశబోయిన శ్రవణ్, బయ్య శోభన్, ఇప్ప సాంబమూర్తి, పులి ప్రభాకర్, రామ్ రాజ్, సమ్మయ్య, నర్సింగరావు, శంకర్, రమేశ్, ప్రకాశ్, రవికుమార్, మహేందర్, కోటేశ్వర్, రాజ్‌కుమార్, కృష్ణ, హరికృష్ణ, గోపీకృష్ణ పాల్గొన్నారు.

జిల్లా అంతటా కురిసిన వర్షం

- దామెరలో అత్యధికం-ఐనవోలులో స్వల్పం
- మూడు మండలాల్లో ఇంకా లోటు వర్షపాతం
- నాలుగు మండలాల్లో సాధారణాన్ని మించి
- ఆలస్యమవుతున్న వరినాట్లు
- తుఫాను పైనే అన్నదాతల ఆశలు

కాకాజీకాలనీలోని ఎస్సీ హాస్టల్ ఆవరణలో వాననీరు

అంబేద్కర్ భవన్ అశోకాకాలనీ రోడ్డుపై వరద నీరు

హనుమకొండ సబర్బన్, జూలై 15 : వర్షాకాలం మొదలైన తర్వాత తొలిసారిగా జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం మొదలైన వాన అన్ని ప్రాంతాలకు విస్తరించి, ముసురుగా కొనసాగింది. అయితే, మూడు నాలుగు మండలాల్లో మాత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో వాన పడగా మిగతా మండలాల్లో మాత్రం మోస్తరుగా పడింది. దామెర మండలంలో అత్యధికంగా 51.7 మిల్లీమీటర్ల వానపడగా, హసన్‌పర్తి మండలంలో 43.7, కమలాపూర్ మండలంలో 36.7 వర్షపాతం నమోదైంది. హనుమకొండ, ఎల్కతుర్తి, పరకాల, ఆత్మకూరు, భీమదేవరపల్లి మండలాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో కురిసింది. ఐనవోలు మండలంలో అత్యల్పంగా 2.3 మిల్లీమీటర్లు, వేలేరులో 9, ధర్మసాగర్‌లో 9.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లా మొత్తం సరాసరి చూస్తే 25.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వానకాలం మొదలై రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలు పడలేదు. ఈసారి ముందస్తుగానే వర్షాలు పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ సూచన నేపథ్యంలో రైతులు ఆశతో ముందస్తుగానే వరినార్లు పోసుకున్నారు. నార్లు ముదురుతున్నాయి గానీ, వర్షాలు మాత్రం రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో చల్లుకున్న జీలుగ విత్తనాలు భారీ స్థాయిలో పెరిగి పోయాయి. మొత్తంగా చూస్తే రాబోయే తుఫానుపై అన్నదాతలు భారీ ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలోని 14 మండలాలకు గాను పరకాల, నడికూడ మండలాల్లో ఇప్పటికీ లోటు వర్షపాతమే ఉంది. 8 మండలాల్లో సాధారణ వర్షాపాతం నమోదైంది. మరో 4 మండలాల్లో సాధారణానికి మించి వర్షపాతం కురిసినప్పటికీ చెరువులు, కుంటల్లో మాత్రం చుక్క నీరు రాలేదు. వరి నాట్లు కుంటు పడ్డాయి. మెట్ట పంటలకు మాత్రం అనుకున్న మేరకు వానలు పడుతున్నాయి.

నగరంలో దంచి కొట్టిన వాన

వరంగల్ : నగరంలో వాన దంచికొట్టింది. జోరు వానకు ప్రధాన రహదారులు నీట మునిగాయి. సరిగ్గా కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల పని వేళలు ముగిసి బయటకు వచ్చే సమయంలో వాన కొట్టింది. ఒక్కసారిగా కురిసిన వానతో ప్రజలు అతలాకుతలమయ్యారు. హనుమకొండ ప్రాంతంలోని బాలసముద్రం, కాకాజీ కాలనీ, బస్‌స్టేషన్, కాకతీయ డిగ్రీ కళాశాల, అంబేద్కర్ భవన్ ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. రహదారులు వరద నీటిలో మునిగి పోయాయి. వాహనాదారులు, ప్రయాణికులు త్రీవ ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం కేడీసీ నుంచి బయటికి వచ్చిన విద్యార్థులు వరద నీటితో అవస్థలు పడాల్సి వచ్చింది. కాలేజీ ఎదుట రహదారి పూర్తిగా మునిగి పోయింది. దీంతో విద్యార్థులు అందులో నుంచి నడుచుకుంటూ బయటికి వచ్చారు. పాత డీపీఆర్‌వో వెనుక వైపు ఉన్న ఎస్సీ హాస్టల్‌లోకి వరద నీరు రావడంతో విద్యార్థులు బయటికి వచ్చారు.

మత్తడి కాల్వపై అక్రమ నిర్మాణం కూల్చివేత

అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న దృశ్యం

పరకాల, జూలై 15 : పట్టణంలోని దామెర చెరువు మత్తడి కాలువపై ఉన్న అక్రమ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మత్తడి నీరు సజావుగా వెళ్లేందుకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను తొలగిస్తున్నారు. దామెర చెరువు మత్తడి కాలువపై అక్రమ నిర్మాణాలు వెలువడంతో ఏటా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మత్త డి కాలువను పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. గతంలోనే కొంత మేర కాలువ నిర్మాణం పూర్తి కాగా, ఆక్రమణల వల్ల పనులు ఆగిపోయాయి. దీంతో ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పలుమార్లు సర్వే చేశారు. సర్వే అనంతరం ఆక్రమణలను తొలగించేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పలువురికి గతంలోనే నోటీసులు కూడా ఇచ్చారు. అయినా అక్రమ నిర్మాణాలను తొలగించకపోవడంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కూల్చివేసినట్లు కమిషనర్ నర్సింహ తెలిపారు.

కేయూ ఇంజినీరింగ్‌లో విభాగాధిపతులు వీరే..

హనుమకొండ చౌరస్తా, జూలై 15 : కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ కరుణ వాకాటి ఆదేశాల మేరకు యూనివర్సిటీ ఇంజినీరింగ్ సబ్జెక్టులో నూతనంగా విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ నూతన విభాగాలకు అధిపతులను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో మెకానికల్ విభాగాధిపతిగా విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల(కోఎడ్యుకేషన్) సహాయ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ రాధికను నియమించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగ ఇన్‌చార్జి అధిపతిగా కూడా ఆమే కొనసాగుతారు. కొత్తగూడెం ఇంజినీరింగ్ కళాశాల సహాయ ఆచార్యులు ఎన్ రమణను కంప్యూటర్ సైన్సు అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా, కే భిక్షాలును ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా, టీ జగన్మోహన్‌రాజును ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా నియమించారు. కాగా, కేయూ ఫార్మసీ విభాగ సహాయ డాక్టర్ బీ నాగరాజును విశ్వవిద్యాలయ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా నియమిస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నాగరాజు గతంలో వసతి గృహ సంచాలకుడిగా, బీసీ సెల్ సంచాలకుడిగా పనిచేశారు. కాగా, కేయూ పాలక మండలి సభ్యుడిగా నూతనంగా నియామకమైన క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీ సురేశ్‌లాల్‌ను విశ్వవిద్యాలయ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ఏటీబీటీ ప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ జేత్య, డాక్టర్ శ్రీధర్ కుమార్, కుమారస్వామి సన్మానించారు.

బస్సుల కోసం ఎదురుచూపులు

ప్రయాణికులతో కిక్కిరిసిన హనుమకొండ బస్‌స్టేషన్

హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

హనుమకొండ చౌరస్తా, జూలై 15 : హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సులు సమయానికి రాక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. బస్సులు ఎంతకూ రాకపోవడంతో గంటల తరబడి ఎదురుచూశారు. రోజూ హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి వేలాది బస్సులు వెళ్తుంటాయి. ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకపోవడంతో నిత్యం వేచి చూడాల్సి వస్తోంది. సోమవారం హనుమకొండ బస్‌స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫామ్స్‌లో బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. బస్సుల ఆలస్యంపై ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభానును వివరణ కోరగా 'సోమవారం కావడంతో ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంది. మళ్లీ రెండురోజుల సెలువులు రావడంతో తిరిగేవారు కూడా ఎక్కువగా ఉంటారు. బస్సులన్నీ సమయానికి నడుస్తున్నాయి వెనువెంటనే ప్రయాణికులను పంపిస్తున్నాం' అని సమాధానం ఇచ్చారు.

జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

ప్రజలు ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

వరంగల్, జూలై 15 : ప్రజలు అధ్యాత్మిక మార్గంలో నడవాలని సుఖ్‌దేవ్ గురుస్వామి మహారాజ్ పిలుపునిచ్చారు. సోమవారం ఇస్కాన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర గార్డెన్‌లో జరిగిన జగన్నాథ యాత్ర ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వరంగల్ నగరం మంచి ఆధ్యాత్మిక కేంద్రమన్నారు. ఇక్కడ పుట్టిన ప్రజలు అదృష్టవంతులన్నారు. కాగా, నగరంలో జగన్నాథ రథయాత్ర శోభాయమానంగా సాగింది. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి ప్రారంభమైన రథయాత్ర అశోకా జంక్షన్, హనుమకొండ చౌరస్తా, అలంకార్ జంక్షన్, ములుగురోడ్డు, కేఎంసీ, ఎంజీఎం జంక్షన్, పోచమ్మమైదాన్ మీదుగా తిరిగి వెంకటేశ్వర గార్డెన్ వరకు సాగింది. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఇస్కాన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు షడ్భుజంగా ప్రభు, మాజీ అధ్యక్షుడు మురళీవర్ధన్, హరికృష్ణ నందదాస్, రవి ప్రభు, భూపవన హరినామాదాస్, జక్పాల్, కిశోర్ దాస్, ధర్మేంద్రదాస్, విజయ్‌ప్రభు, మురళీకృష్ణ ప్రభు, లక్ష్మణ్‌ప్రభు, సౌరవ్ ప్రభు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★ వరంగల్ హైవేలోని ఆలేరు-కొలనుపాకలో ఓపెన్ ప్లాట్లు మరియు ఫార్మ్‌ల్యాండ్ ప్లాట్లు అమ్మబడును. సాగర్ హైవేలో ఇండస్ట్రియల్ ఏరియాగా అభివృద్ధి చెందుతున్న యాచారంనందు ఓపెన్ ప్లాట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ & క్లియర్ టైటిల్. Ph: 7989747927.
NT-325882

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557

గుడుంబా నిర్మూలనకు కృషి చేయాలి

పరకాల, జూలై 15 : గుడుంబా నిర్మూలనకు అధికారులు కృషిచేయాలని ఆర్డీవో నారాయణ సూచించారు. డివిజన్ పరిధిలో గుడుంబా నిర్మూలనపై పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులతో ఆర్డీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గుడుంబా, డ్రగ్స్ నిర్మూలనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇందులో భాగంగా మండలాల వారీగా గుడుంబా తయారీ, అమ్మకందారుల జాబితాను తయారు చేయాలని సూచించారు. అనంతరం వారికి అవగాహన కల్పించి, మళ్లీ గుడుంబా అమ్మకుండా చేయాలన్నారు. సమీక్షలో ఏసీపీ కిశోర్‌కుమార్, పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఐనవోలు, జూలై 15 : మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన వడ్లకొండ యాదగిరి గౌడ్ తాటి చెట్టు మీద నుంచి జారిపడి మృతిచెందగా బాధిత కుటుంబానికి తాడి కార్పొరేషన్ తక్షణ సాయం కింద మంజూరు చేసిన రూ.25వేల చెక్కును సోమవారం బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి కందాల శంరయ్యగౌడ్, సహాయ అధికారి రజినీకాంత్, తెలంగాణ గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర వెంకటస్వామి అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బుర్ర రాజశేఖర్, మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌గౌడ్, బుర్ర సురేందర్‌గౌడ్, కోతి కుమారస్వామి గౌడ్, కోతి ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నాయకులు చెక్కులివ్వడం సరికాదు'

భీమదేవరపల్లి, జూలై 15 : సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేయడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు వచ్చే చెక్కులను ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేయాల్సి ఉండగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీచేయాలని డిమాండ్ చేశారు.

అప్రెంటిస్‌షిప్ మేళా పోస్టర్ల ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, జూలై 15 : హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్యాజూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఈ నెల 19 ఉదయం 10 గంటలకు నిర్వహించే అప్రెంటిస్‌షిప్ మేళా-2024 పోస్టర్లను ప్రిన్సిపాల్ బెడుదం శ్రీనివాస్ సోమవారం ఆవిష్కరించారు. 2021-22, 23-24 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైనవారికి ఆర్డీఎస్‌డీఈ సంస్థ నెలకు రూ.7 వేలు స్టైఫండ్ చెల్లిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పీ దివాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఎస్ శ్రీనివాస్, అధ్యాపకులు ఎం విష్ణుకాంత్, ఎం రాజేంద్రప్రసాద్, పీ విజయకుమార్, ఏ దిలీప్, ఖాదర్‌బాబా, డీ రవి, హన్, మహేందర్, జయపాల్, భిక్షం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మడికొండ : మాట్లాడుతున్న కార్పొరేటర్ రాధికారెడ్డి

గుండ్ల సింగారం అంగన్‌వాడీ కేంద్రంలో..

మడికొండ, జూలై 15 : బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రేటర్ 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి సూచించారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మడికొండలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లతో కలిసి డీడబ్ల్యూవో మధురిమ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ డీ రాజ్యలక్ష్మి, పోషణ అభియాన్ డీసీ సుమలత, హెచ్ఎం సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, వసంత, రాజ్యలక్ష్మి, రాణి, కవిత, రజిత, లలిత, మంజుల, జోత్స్న, రాజమణి పాల్గొన్నారు. అలాగే, గుండ్ల సింగారం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం వేణు, అంగన్‌వాడీ టీచర్ సీహెచ్ జ్యోతి, ఎస్ సమ్మక్క పాల్గొన్నారు.

'కులగణన చేసే వరకూ పోరాటం'

హనుమకొండ చౌరస్తా, జూలై 15 : రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దమాషా ప్రకారం పెంచే వరకూ ఉద్యమాన్ని ఆపేదిలేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ అన్నారు. ఆదివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు సమగ్ర కులగణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతానికి బీసీ రిజర్వేషన్లను పెంచుతామని స్పష్టమైన హామీ ఇచ్చిందన్నారు. ఆ హామీని గుర్తు చేయడానికి బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి నుంచే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమగ్ర కులగణన సాధన యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18న హంటర్‌రోడ్ సత్యం కన్వెన్షన్‌హాల్‌లో సభ ఉంటుందని తెలిపారు. బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బచ్చు ఆనందం, దాడి మల్లయ్యయాదవ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరిగౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తౌటం రవీందర్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మేల శోభరాణి, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకుడు కాసగాని అశోక్‌గౌడ్, పంజాల మధు, డాక్టర్ ఒడితల రాము, అరేగంటి నాగరాజు, కురిమిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మారగోని రవి, తంగళ్లపల్లి రమేశ్ పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్ యజమాని బైండోవర్

ఎల్కతుర్తి, జూలై 15 : అక్రమంగా మట్టి తీస్తున్న మండలంలోని జగన్నాథపూర్ గ్రామానికి చెందిన ఎక్స్‌కవేటర్ యజమాని కస్తూరి పరమేశ్‌ను తహసీల్దార్ జగత్‌సింగ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎల్కతుర్తి ఎస్సై గోదారి రాజుకుమార్ తెలిపారు. గతంలో వందలాది ట్రిప్పుల మట్టిని తీసి, విక్రయిస్తూ పలుసార్లు పట్టుబడ్డాడు. తీరు మార్చుకోకపోవడంతో బైండోవర్ చేసినట్లు వెల్లడించారు.

బ్యాటరీల దొంగ అరెస్ట్

ధర్మసాగర్, జూలై 15 : ట్రాక్టర్లు, టిప్పర్లు, జేసీబీలకు ఉన్న బ్యాటరీల చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ధర్మసాగర్ సీఐ మహేందర్ తెలిపారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ధర్మసాగర్, చిల్పూర్, రఘునాథపల్లె, జనగామ, బచ్చన్నపేట, చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాక్టర్లు, టిప్పర్లు, జేసీబీలకు సంబంధించిన బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నట్లు కేసులు నమోదయ్యాయి. ధర్మసాగర్ పీఎస్ పరిధి రాంపూర్ హైవేపై వీఎంఆర్ కాలేజీ, అంబేద్కర్ సెంటర్ వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా కారులో గుర్తుతెలియని వ్యక్తి వస్తుండగా పోలీసులు ఆపి తనిఖీ చేశారు. 12 బ్యాటరీలు ఉన్నట్లు గుర్తించారు. అతడిని విచారించగా ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాలోని తాళ్లరేవు మండలం రంగనాయకపురానికి చెందిన అతడు అధిక డబ్బులు సంపాదించాలని బ్యాటరీలు చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. వీటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లో వాటిని అమ్మడానికి తీసుకెళ్తుండగా పట్టుకుని అరెస్టు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజు, నరసింహారావు, క్రైమ్ సిబ్బంది సంపత్, కరుణాకర్ ఉన్నారు. వీరిని కాజీపేట ఏసీపీ అభినందించారు.

జవహర్‌కాలనీలో నీటి సరఫరా బంద్

వరంగల్, జూలై 15 : గ్రేటర్ 56వ డివిజన్ పరిధి జవహర్‌కాలనీ ప్రాంతంలో మూడు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు బల్దియా ఈఈ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మిస్తున్నందున కొత్తగా పైపులైన్ వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మూడు రోజుల పాటు తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. జవహర్ నగర్ కుడి వైపు రోడ్ నెంబర్ 1 నుంచి 6 వరకు మంగళ, బుధ, గురువారాల్లో తాగునీటి సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

'దీప్తా మాత'గా భద్రకాళీ

వరంగల్, జూలై 15 : భద్రకాళి శాకాంబరీ నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పదో రోజు సోమవారం అమ్మవారిని ఉదయం దీప్తా మాతగా అలంకరించారు. షోడష క్రమం అనుసరించి సాయంత్రం కులసుందరీగా అలంకరించారు. అమ్మవారిని దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు, సహాయ కమిషనర్ రామల సునీత దర్శించుకున్నారు.

నిఖితాంజలికి అరుదైన గౌరవం

వరంగల్, జూలై 15 : దీనదయాళ్ అంత్యోదయ యోజనలో భాగంగా నేషనల్ అర్బన్ లైవ్‌లీ ఉడ్ పీఎం స్వానిధి వార్షిక విజయోజత్సవాల్లో పాల్గొనేందుకు గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలోని స్వయం సహాయక సంఘం సభ్యురాలు నిఖితాంజలికి అవకాశం దక్కింది. ఈ నెల 18న ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లోని స్టైయిన్ అడిటోరియంలో జరిగే ఉర్కృష్టతా కి ఒర్ బడే కదమ్ పేరిట